

విద్యార్థులకు చలి నుంచి రక్షణ కోసం చర్యలు

అధికారులకు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం

మెదక్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు చలిబారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సంక్షేమాధికారులను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. హాస్టళ్లలో చలి బెంగ గురించి 'ఆంధ్రజ్యోతి' ఇటీవల కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం సంక్షేమాధికారులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థులకు అవసరమైన బెడ్‌షీట్స్, కార్పెట్స్ సరఫరా చేయాలని ఆదేశించారు.



పోలీసు వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

పకడ్బందీగా కేసుల దర్యాప్తు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

హిజ్రాలు ఆగడాలకు పాల్పడితే చర్యలు

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు జరిపి బాధితులకు అండగా నిలవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశం ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తునకు ప్రత్యేక ప్రణాళికతో దర్యాప్తు చేయాలన్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. రాత్రి పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు పాపిలోన్ డివైస్‌ను వినియోగించి అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్ సేకరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం చేయాలని సూచించారు.

ప్రజలను ఇబ్బందిపెడితే హిజ్రాలపై చర్యలు

వివాహాలు, గృహప్రవేశాలు, శుభకార్యాలలో, బిక్షాటనలో హిజ్రాలు అడిగినంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజలను ఇబ్బందిపెడితే చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎస్పీ సూచించారు. ముఖ్య ప్రాంతాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పోలీసు వాహనాలను కండిషన్‌లో ఉంచాలి

పోలీసుశాఖ వాహనాలను ఎస్పీ పరితోష్ పంకజ్ తనిఖీ చేశారు. ప్రతీ వాహనానికి రెగ్యులర్‌గా సర్వీసింగ్ చేయించాలని, ఎలాంటి మరమ్మతులు లేకుండా కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి రివార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ రఘునందన్‌రావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, సైదానాయక్, సురేందర్‌రెడ్డి, నరేందర్, సీఐలు రమేష్, కిరణ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, సదానాగరాజ్, ప్రవీణ్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ధాన్యం మళ్లింపు..

రెండు రైస్ మిల్లులపై కేసులు

7

లంచాల లాఠీ..!

ఉమ్మడి జిల్లాలో దారితప్పుతున్న ఖాకీలు

- వారంలోనే ఏసీబీ చేతికి చిక్కిన ఇద్దరు ఎస్ఐలు
- పోలీస్‌శాఖలో పెచ్చుమీరుతున్న అవినీతి
- ఖాకీల వేధింపులతో బలవన్మరణ ప్రయత్నాలు
- శాంతిభద్రతల కన్నా సంపాదనే మిన్న..

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం అస్సద్ మహ్మద్‌పల్లి తండా వద్ద వరి కోత యంత్రం పరికరాల దొంగతనం జరిగింది. యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దొంగిలించిన పరికరాలు గ్రామంలోనే హార్వెస్టర్ యజమానికి లభించాయి. కేసు రాజీ కుదిర్చేందుకు ఎస్ఐ రాజేశ్ రూ.40వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితులు ఏసీబీని ఆశ్రయించడంతో మంగళవారం పట్టుబడ్డాడు.

సంగారెడ్డి రూరల్ ఎస్ఐగా ఉన్న రవీందర్‌ను అక్టోబరు 3వ తేదీన సస్పెండ్ చేశారు. సంగారెడ్డిలోని లాడ్జిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా.. లాడ్జి నిర్వాహకుడిని ప్రత్యక్ష సాక్షిగా పేర్కొంటూ అతని వద్ద డబ్బులు డిమాండ్ చేసి వేధించాడు. దీంతో లాడ్జి నిర్వాహకుడు మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ వేధింపుల వల్లే ఇదంతా జరిగిందని ప్రాథమిక విచారణలో తేలడంతో సస్పెండ్ చేశారు.

సిద్దిపేట జిల్లా ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ రాజు రూ.50వేలు లంచం తీసుకుంటూ ఈ నెల 11న ఏసీబీకి పట్టుబడ్డారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఓ ఇంటి సమస్యను పరిష్కరించడానికి లంచం డిమాండ్ చేశారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు.



సంగారెడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో పోలీస్‌శాఖపై అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయి. కొందరు అధికారులు లంచం లేనిదే పనిచేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు నిదర్శనంగా గడిచిన వారం రోజుల్లోనే ఇద్దరు ఎస్ఐలు, కానిస్టేబుల్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గత నెలలో ఓ ఎస్ఐని సస్పెండ్ చేశారు. తమ ఉద్యోగాన్ని దుర్వినియోగం చేస్తూ అందినకాడికి దండుకున్నారు. ఎవరైనా తమ మాట వినకుంటే లాఠీ ఎత్తి తమ దారిలోకి తెచ్చుకుంటున్నారు.

సెటిల్మెంట్లలో కీలకం

సివిల్ పంచాయతీల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని ఉన్నతాధికారులు, కోర్టులు హెచ్చరిస్తున్నా కొందరి తీరు మారడం లేదు. డబ్బులు ఖర్చు పెట్టి పోస్టింగులు తెచ్చుకున్న వారు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. కానిస్టేబుళ్ల నుంచి సీఐల దాకా ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. రెండు నెలల క్రితం సిద్దిపేట రూరల్ సీఐ తనను చితకబాదడంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డట్లు ఓ యువకుడు లేఖ రాశాడు. ప్రస్తుతం ఇదే స్టేషన్‌లో ఓ గ్రామానికి చెందిన భూమి సెటిల్మెంట్ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, అమీన్‌పూర్, భానూరు, రామచంద్రాపురం, కొల్లూరు ప్రాంతాల్లో భూవివాదాలు, పారిశ్రామిక వివాదాల్లో తలదూర్చుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక సిద్దిపేట జిల్లా గజ్వేల్ డివిజన్ పరిధిలోనూ వసూళ్ల పర్వం నడుస్తున్నట్లు చర్చ జరుగుతోంది. చేర్యాల ప్రాంతంలో పోలీసుల పేరిట ఓ నాయకుడు రూ. లక్ష తీసుకున్నారనే పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి.



పారిపోతుండగా ఎస్ఐను పట్టుకొచ్చిన ఏసీబీ అధికారులు

ఎంతోకొంత ఇవ్వాల్సిందే..

పలు పోలీస్‌స్టేషన్లలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉదారంగా వ్యవహరిస్తుండగా ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మాత్రం చేతులు చాపుతున్న పరిస్థితి దాపురించింది. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితులను కూడా వదలడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కేసులను రాజీ కుదర్చడం, నిందితులను పట్టుకురావడం, ఇతర వ్యవహారాల్లోనూ ఆశిస్తున్నట్లుగా విమర్శలు ఉన్నాయి. ఆర్థిక స్థోమత లేనివారికి సరైన న్యాయం జరగడం లేదని, డబ్బులు లేదంటే పైరవీల ద్వారా వచ్చిన వారికే పెద్దపీట వేస్తున్నారనే చర్చ కొన్ని ఏరియాల్లో నిత్యం జరుగుతోంది. తాజాగా టేక్మాల్ ఎస్ఐ

మిగతా 7వ పేజీలో



వదలని చలి

ఉమ్మడి మెదక్ జిల్లాలో వారం రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు

కోహీర్‌లో 7.8 డిగ్రీలు

కోహీర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత కొనసాగుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 17 ప్రాంతాల్లో మంగళవారం సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లాలో నార్లాపూర్‌లో 9.5 డిగ్రీలు, సిద్దిపేట జిల్లాలో పోతారెడ్డిపేటలో 9.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఉదయం నమోదైన కనిష్ట ఉష్ణోగ్రత వివరాలు

సంగారెడ్డి జిల్లా కోహీర్ 7.8, న్యాల్‌కల్ 8.2, ఝరాసంఘం 8.4, సదాశివపేట 8.4, అల్లోల్ 9.1, మొగుడంపల్లి 9.3, కడ్పల్ 9.4, రాయికోడు 9.5, దిగ్వాల్ 9.5, కంగ్టి 9.8, నిజాంపేట్ 9.9, నల్లవల్లి 10.1, సత్వార్ 10.1, పుల్కల్ 10.2, నాగలగిద్ద 10.2, మనూర్ 10.7, మల్‌చేల్మ 10.8,మునిపల్లి 10.8, ముక్తాపూర్ 10.9, సిర్గాపూర్ 10.9, రామచంద్రపురం 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో నార్లాపూర్ 9.5, దామరంచ 9.9, దొంగల ధర్మారం 10.1, శంకరంపేట 10.3, మినీపూర్ 10.3, బోడగట్ 10.3, చిట్కుల్ 10.4, శివనూర్ 10.4, మనోహరాబాద్ 10.5, లింగాయపల్లి 10.6 కుల్చారం 10.6, టెక్మాల్ 10.6, బుజరంపేట 10.7, వెల్దుర్తి 10.7, శివ్వంపేట 10.8, మాసాయిపేట 112.2 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లా పోతరెడ్డిపేట 9.2, కొండపాక 9.7, హబ్సీపూర్ 9.8, అంగడి కిష్టాపూర్ 9.9, దూల్మిట్ట10.3, దౌల్తాబాద్ 10.4, వెంకటరావుపేట్ 10.4, తుక్కాపూర్ 10.4, నంగునూరు 10.6, కొండకండ్ల 10.7, రేబర్తి 10.7, మునిగండప్ప 10.7, మిరుదొడ్డి 10.8, రాంపూర్‌లో 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



మెదక్ మార్కెట్‌లో కొనుగోలుదారులు లేక బోసిపోతున్న కూరగాయల దుకాణాలు

పచ్చడి మెతుకులే..!

కూరలు కొనలేం..

బీరకాయం కిలో 120

వంకాయ, పొట్లకాయదీ అదే బాట

ఆకు కూరలూ ఆకాశంలోనే

జిల్లాలో 4 లక్షల ఎకరాల సాగు భూమి

1,800 ఎకరాల్లోనే ఉద్యాన పంటలు

ప్రోత్సాహం లేక నామమాత్రంగా..

మెదక్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెతుకుసీమలో కూరగాయల ధరలు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏది కొందామన్నా రూ.100కు పైగానే ధర పలుకుతుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు కుదేలవుతున్నారు. స్థానికంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవడం, ఉన్న కొద్దిపాటి పంటలు భారీ వర్షాలకు చెడిపోవడమే కారణమని తెలుస్తున్నది. ఉద్యాన పంటల సాగుకు అనేకవిధాలుగా ప్రోత్సాహిస్తున్నా రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం టమాటా, మిర్చి, వంకాయ తదితర పంటలు వేసుకోవడానికి ఉచితంగా నారు సరఫరా చేస్తోంది. ఉల్లినారు కొనుగోలుకు సబ్సిడీ ఇస్తోంది. అయినా రైతులు ఆసక్తి చూపకపోవడం గమనార్హం.

కేవలం 1,800 ఎకరాల్లోనే ..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. మిగిలిన 37వేల ఎకరాల విస్తీర్ణంలో పత్తి, ఆరుతడి పంటలు, చిరు ధాన్యాలు వేశారు. కూరగాయల పంటలు మాత్రమే సాగుచేసే భూమి 1,800 ఎకరాలు (మొత్తం సాగు భూమిలో 0.45 శాతం) మాత్రమే ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. జిల్లా ప్రజల డిమాండ్‌కు సరిపడా కూరగాయ పంటల ఉత్పత్తి లేకపోవడంతో పొరుగు జిల్లాల మార్కెట్ల నుండి వ్యాపారులు, ఏజెంట్లు కూరగాయలు దిగుమతి చేసుకుని కమీషన్‌కు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు నిత్యం కొనుగోలు చేసే కూరగాయల రేట్లు అమాంతంగా పెరిగిపోతున్నాయి. జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్, చేగుంట, నిజాంపేటతో పాటు అన్ని మండల కేంద్రాల్లో కూరగాయల విక్రయాలు జరుగుతుంటాయి. ప్రస్తుతం పెరిగిన ధరలతో కూరగాయలు కొనలేకపోతున్నామని ఉద్యోగులు, కార్మికులు, దినసరి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉద్యాన వనశాఖాధికారి, ఇద్దరు హార్టికల్చర్ అధికారులు మాత్రమే ఉన్నారు. వీరితో 22 మండలాలు పర్యవేక్షించడం కష్టమవుతోందని అధికారులు వాపోతున్నారు. కారణాలేనని పలువురు రైతులు చెబుతున్నారు.

కూరగాయల ధరలు (కిలో)

టమాట	రూ.50
బీరకాయ	రూ.120
వంకాయం	రూ.120
దోసకాయ	రూ.60
పొట్లకాయ	రూ.120
క్యారెట్	రూ.100
ఆలుగడ్డ	రూ.60
గుమ్మడి కాయ	రూ.150
పచ్చిమిర్చి	రూ.80
బెండకాయ	రూ.80
దొండకాయ	రూ.120
ఆకు కూరలు	రూ.80
బచ్చలి కూర	80
చుక్కకూర	80

కొబ్బరికాయ రూ.40

రామాయంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను దర్శించుకున్న భక్తులు కొబ్బరికాయలు కొట్టడం ఆనవాయితీ. ఇపుడు వాటి ధరలు రెట్టింపయ్యాయి. నెల క్రితం రూ.20 పలికిన కొబ్బరికాయ ఒక్కసారిగా ఆకాశాన్నంటింది. హోల్‌సేల్ మార్కెట్లో రూ. రూ.40కి అమ్ముతున్నారు. దీంతో అమ్మకాలు సగానికి పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. తుపాన్ దెబ్బతో కొబ్బరి చెట్లు నేలకూలి, దిగుబడి తగ్గడంతో మార్కెట్లో కొబ్బరికాయల కొరత ఏర్పడింది. సరఫరా తక్కువగా ఉండటంతో రేట్లు పెరిగినట్లు వారు పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయులకు 'టెట్' బెంగ

విడుదలైన నోటిఫికేషన్.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

అర్హత సాధించేందుకు ఇన్‌సర్వీస్ టీచర్ల ఆపసోపాలు

సన్నద్ధమవుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు



మెదక్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నోటిఫికేషన్ తెలంగాణ సర్కార్‌ట ఇటీవల విడుదల చేసింది. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎన్‌సీటీఈ మార్గదర్శకాలు విడుదల చేసింది. విద్యాశాఖ తాజా ఉత్తర్వుల్లో ఈ అంశాన్ని ముద్రించింది. బీఈడీ, డీఈడీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీజీహెచ్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నవారు ఇక టెట్ అర్హత సాధించాల్సి ఉంటుంది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగులు, ఇన్‌సర్వీసు టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ నెల 29 వరకు గడువు ఉంది. జనవరిలో కంప్యూటర్‌లో పరీక్ష నిర్వహించనున్నారు.

ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలలు కలిపి మెదక్ జిల్లాలో 3,103 మంది, సంగారెడ్డి జిల్లాలో 5,208 ఉపాధ్యాయులు చేస్తున్నారు. వీరిలో చాలామందికి టెట్ అర్హత లేదు. వీరంతా పరీక్షకు సిద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజా పదోన్నతుల్లో వీరంతా టెట్ అర్హత లేకుండానే పదోన్నతి పొందారు. ఇప్పుడు ఆ అర్హత తప్పక సాధించాలి.

కొత్త మార్గదర్శకాలు

ఎన్‌సీటీఈ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతీ ఉపాధ్యాయుడికి టెట్ అర్హత ఉండాలి. దీనిని నుంచి మినహాయించుకోవాలని టీచర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో టెట్ హాజరు తప్పనిసరి అవుతోంది. మరోవైపు డీఈడీ, బీఈడీ పూర్తిచేసి సర్కారు కొలువు కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు కూడా టెట్‌కు సిద్ధమవుతున్నారు.



రాజంపేట హెల్త్ సబ్ సెంటర్ భవనం

మంజూరు 124.. పూర్తయినవి సున్నా

- సంగారెడ్డి జిల్లాలో హెల్త్ సబ్‌సెంటర్లకు గ్రహణం
- నిధులు సరిపోక ముందుకు సాగని పనులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాల పక్కా భవనాల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో 246 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఇందులో 124 కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ 2022 మే 31న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ జూలై 10న పరిపాలనా అనుమతి ఇచ్చారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిధులు సరిపోక మధ్యలోనే పనులు నిలిపేశారు. వాస్తవానికి ఒక్కో భవన నిర్మాణం పూర్తిచేయాలంటే రూ.26 లక్షలు అవసరమని ఇంజనీరింగ్ పేర్కొంటున్నారు. ఇదే విషయం ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులకు నివేదించినా ఇప్పటి వరకు నిధుల పెంపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తే తప్ప కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనులు పూర్తిచేసే పరిస్థితి లేదని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో ఆరోగ్య ఉపకేంద్రాలకు వచ్చే రోగులు అరకొర వసతులతో ఇబ్బంది పడుతున్నారు.

సంగారెడ్డి జిల్లాలో మంజూరైన హెల్త్ సబ్ సెంటర్ల పరిస్థితి ఇలా

నియోజకవర్గం	మంజూరైనవి	పనులు ప్రారంభం	ప్రారంభం కానివి	స్థలం కొరత	పాక్షికంగా పూర్తయినవి
అందోల్	29	6	23	0	0
నారాయణఖేడ్	13	1	5	4	4
పటాన్‌చెరు	26	1	5	6	14
సంగారెడ్డి	22	3	1	3	15
నర్సాపూర్	9	3	2	0	4
జహీరాబాద్	25	6	5	0	14
మొత్తం	124	20	41	13	50

ప్రతిభను వెలికి తీయడానికే సైన్స్ ఫెయిర్

జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సైన్స్ ఫెయిర్‌లు ఉపయోగపడతాయని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ శివార్లలోని ఈ-తక్షిలా పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి 53వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం ప్రభుత్వం ఇలాంటి ప్రదర్శనలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రదర్శనలో ఏడు అంశాలకు సంబంధించి ప్రాథమిక, ప్రాథమికోన్నత, పాఠశాలలకు సంబంధించి 519 ప్రదర్శనలను విద్యార్థులు ఏర్పాటు చేశారు. 108 ఇన్‌స్పైర్ ప్రదర్శనలను ఏర్పాటు చేయగా, ఉపాధ్యాయుల విభాగానికి సంబంధించి నాలుగు ప్రదర్శలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, డీసీఈబీ కార్యదర్శి లింబాద్రి పాల్గొన్నారు.









విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఈ నెల 21న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఎంపికలు

మెదక్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఈనెల 21న ఖేలో ఇండియా అస్మిత జిల్లాస్థాయి ఎంపికలు మెదక్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. అండర్-14, 16 బాలికలకు రన్స్, త్రో, జంప్స్ మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మిగితా వివరాలకు ఫోన్ 9963005540 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి


సాయిలు మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

రాయపోల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేపల వేట కోసం వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి మృతిచెందిన సంఘటన రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గజ్వేల్‌కు చెందిన మోతె సాయిలు(45) ఈ నెల 16న సాయంత్రం చేపల వేటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఓ బాలుడితో కలిసి బైక్‌పై లింగారెడ్డిపల్లి చెరువుకు వెళ్లాడు. అక్కడ చేపలు పడుతున్న సమయంలో సాయిలు చెరువులో మునిగిపోయాడు. ఎంతసేపైనా ఆయన పైకి రాకపోవడంతో భయపడిన బాలుడు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. సోమవారం సమాచారం అందుకున్న బంధువులు చెరువు వద్దకు చేరుకొని గాలింపు చేపట్టారు. సోమవారం సాయంత్రం సాయిలు మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీశారు. మృతుని భార్య మోతె పెంటవ్వ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మానస తెలిపారు.

బాలుడిని చితకబాదిన పిన తండ్రికి రిమాండ్


సత్యనారాయణ

రామాయంపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలుడిని చితకబాదిన పిన తండ్రిని మంగళవారం పోలీసులు రిమాండ్ చేశారు. రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటకు చెందిన సత్యనారాయణ ఈ నెల 13న భార్యతో గొడవపడి ఆమె కొడుకుని బెల్టుతో కొట్టి రాక్షసంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత చిన్నారికి మెదక్ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించారు. అప్పటి నుంచి పరారిలో ఉన్న నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

కంది సాగు.. లాభాలు బాగు

● పత్తి, మొక్కజొన్నతోపాటు అంతర పంటగా కంది..
● జిల్లా వ్యాప్తంగా 7 వేల ఎకరాలకు పైగా సాగు
● పూత, కాయ దశలో జాగ్రత్తలు కీలకం

జగదేవ్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అలిరాజపేట పరిసరాల్లో పత్తి చేనుల్లో మధ్యంతర పంటగా కంది మంచి ఎదుగుదలతో కనిపిస్తోంది. తక్కువ ఖర్చుతో లాభాలు చేకూర్చే పంటగా రైతులు కందిని ఎక్కువగా ఎంచుకుంటున్నారు. తేలికపాటి ఎర్ర నేలల్లో అధికంగా సాగుచేసే ఈ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటమే కాక, కూలీల అవసరం కూడా స్వల్పమే. జిల్లాలో 7వేల ఎకరాలకు పైగా సాగుచేయగా, గజ్వేల్ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్, మర్కుక్, వర్గల్, కుకునూరుపల్లి మండలాల్లో కంది సాగు ఎక్కువగా నమోదైంది. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండటంతో చేనులో పురుగుల బారిన పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మంచు అధికంగా ఉండటంతో ఆకు చుట్టూ పురుగు ప్రబలే ప్రమాదం ఉన్నందున రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు ఇలా..

ఆకు చుట్టూ పురుగు నివారణకు లీటరు నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మరుక మచ్చల పురుగు నియంత్రణకు హెమామెక్ క్లీనెంజోమెట్, ప్రొక్లెమ్ లేదా బెంజర్సు 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాయ తొలిచే పురుగు నివారణకు చేతితో కనపడిన పురుగులను తొలగించాలి. అలాగే స్పైనోసాడ్ 45 ఎస్‌సీ 2.5 మిల్లీలీటర్లు లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. కాయ తుప్పు (కాయ ఈగ) వల్ల పంటలోని కాయల్లో లార్వా ఉండి, బీజాలు పొడిగా మారుతాయి. దీని నివారణకు క్వినాల్‌ఫాస్ 25 ఈసీ 2 ఎంఎల్ లీటరు నీటిలో పిచికారీ చేయాలి.


అలిరాజపేటలో ఏపుగా పెరిగిన కందిచేను

అంగన్‌వాడీ రికార్డులు తగులబెట్టిన దుండగులు


బూడిదమైన రికార్డులు

చిలప్‌చెడ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్టోర్ రూంలో భద్రపరిచిన అంగన్‌వాడీ రికార్డులను గుర్తు తెలియని దుండగులు తగులబెట్టిన సంఘటన మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలో గత రాత్రి చోటుచేసుకుంది. మంగళవారం అంగన్‌వాడీ టీచర్ షహనాజ్ బేగం తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి సంబంధించిన 1987 నుంచి 1996 వరకు గల రికార్డులను పాఠశాలలో గల ఒక గదిలో భద్రపరచగా, ఎవరో గుర్తు తెలియని దుండగులు తగులబెట్టినట్లు ఆమె తెలిపారు. ఆ వేడికి గది పైకప్పు పెచ్చులు కూడా ఊడిపడినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి పరిశీలించినట్లు తెలిపారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలు


ఖోఖో పోటీల్లో తలపడుతున్న జట్లు

మెదక్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మైదానంలో మంగళవారం అండర్- 14, 17 బాలబాలికలకు నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి 12 జట్లు, 96 మంది చొప్పున క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయికి ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 48 మంది క్రీడాకారులు ఎంపికైనట్టు ఎజీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకు యాదాద్రిభువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. విజేతలకు ఇంచార్జి డీఈవో విజయ బహుమతులు అందజేశారు.

చేనేతకు త్వరలోనే అధునాతన మగ్గాలు

● సిద్దిపేట జిల్లా ఏడీ ఎం సాగర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుబ్బాక, నవంబరు18(ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని అధునాతన పద్ధతుల వైపు నడిపించడానికి తాము ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వచ్చే నెలలోపు ఎలక్ట్రానిక్ జాకార్డు మగ్గాలను అందుబాటులోకి తేనున్నట్టు సిద్దిపేట చేనేత జౌళి శాఖ ఏడీ ఎం సాగర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వాలు అన్ని రకాల అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేస్తున్నాయని, అందులో భాగంగా చేనేత కార్మికులకు అందజేస్తున్నామని ఆయన అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'చేనేత ఎదురీత' శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఎలక్ట్రానిక్ జాకార్డ్ పద్ధతిన కార్మికులకు మగ్గాలను అందించేందుకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, కార్మికులకు నెలలోపు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల అభివృద్ధి కోసం జరుగుతున్న పథకాలు అమలులో ఉన్నాయన్నారు. సహకార సంఘాల ఎన్నికలకు కూడా తాము ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రభుత్వ పరిధిలోని అంశమనీ, దుబ్బాక సొసైటీ బకాయి పడ్డ రుణాలు ప్రభుత్వం, నాబార్డు నిబంధనల ప్రకారం పొందనందువల్ల తాము ఏమీ చేయలేమని ఆయన తెలిపారు. ఈ విషయంలో విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఇర్కోడు విద్యార్థి



జాతీయ స్థాయికి ఎంపికైన ఇర్కోడు విద్యార్థిని, యోగా ఫెయిర్‌లో ప్రతిభ కబర్చిన నారాయణరావుపేట విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందాలు

సిద్దిపేట రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో, సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి రామ్‌చరణ్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్ తెలిపారు. పదో తరగతి విద్యార్థి రామ్‌చరణ్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ మరియు ప్రశంసా పత్రం అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం, ఫిజికల్ డైరెక్టర్ మంజుల, రామ్‌చరణ్‌ను అభినందించారు.

ఆర్టిస్టిక్ యోగా ఫెయిర్ విభాగంలో ద్వితీయ స్థానం

నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు యామిని, శుష్మితలు ఆర్టిస్టిక్ యోగా ఫెయిర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎర్రవల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచే రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపుతున్న తమ విద్యార్థినులు తమ పాఠశాలకే కాకుండా జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ తోట సతీష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, శ్రీనివాస్, నర్సింహ చారి, పద్మలు విద్యార్థినులను అభినందించారు.

ధరల స్థిరత్వం కేంద్ర బ్యాంకు బాధ్యత

● ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు



మాట్లాడుతున్న డాక్టర్ దువ్వూరి సుబ్బారావు

పటానచెరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధరల స్థిరత్వం కేంద్ర బ్యాంకుల బాధ్యత అని ప్రముఖ ఆర్థిక వేత్త, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ హైదరాబాద్‌లో ఆయన 'కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధి', 'సమస్యలను పరిష్కరించడం: కేంద్ర బ్యాంకింగ్ భవిష్యత్తు' అన్న అంశాలపై మంగళవారం అతిథి ఉపన్యాసం చేశారు. ధర స్థిరత్వం కేంద్ర బ్యాంకు బాధ్యత అయినప్పటికీ, సరఫరాలో లోపాలు తలెత్తినప్పుడు పన్ను సర్దుబాట్లు లేదా సబ్సిడీలు వంటి ప్రభుత్వ ఆర్థిక జోక్యం అవసరమన్నారు. ద్రవ్యోల్బణం పేదలపై అతి పెద్ద పన్నుగా డాక్టర్ సుబ్బారావు అభివర్ణించారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని గుర్తుచేసుకుంటూ, ఆర్బీఐ గవర్నర్‌గా తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో జీఎస్‌బీ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తిగుప్తా, పీజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రనజీ, ప్రొఫెసర్ అజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్య స్నేహితురాలితో సన్నిహిత సంబంధం..

యువకుడిని కత్తితో పొడిచి హత్య


హబీబ్ అన్సారీ (ఫైల్)

నర్సాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ శివారులో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. భార్య స్నేహితురాలితో సన్నిహిత సంబంధం పెట్టుకోవడంతో ఆమె తరఫు వారు ఓ యువకుడిని దారుణంగా పొడిచి చంపినట్లు అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి వివరాలు ఆమె, పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోండా జిల్లాకు ఉత్రౌల తాలుకా గోవర్ధన్ గ్రామానికి చెందిన హబీబ్ అన్సారీ(24) బతుకుదెరువు కోసం ఇక్కడకు వచ్చి.. ఇక్కడ ప్లంబర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం అతను సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో పని చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన సల్మాబేగంను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వివాహం అయిన నాటి నుంచి భార్యాభర్తలు నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే, అన్సారీ భార్య సల్మాబేగంకు ఓ చిన్ననాటి స్నేహితురాలు ఉంది. ఆమెకు గతంలో వివాహం జరిగింది. కొన్ని కారణాల వల్ల భార్యభర్తలు దూరంగా ఉంటున్నారు. ఆమె కూడా నర్సాపూర్‌లోనే నివాసం ఉంటోంది. స్నేహితురాలి వద్దకు వస్తూ పోతున్న క్రమంలో ఆమెతో అన్సారీకి సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో సల్మాబేగం డెలివరీకి తల్లిగారింటికి వెళ్లి వచ్చినా అన్సారీ ఆమె వద్దకు రాకుండా భార్య స్నేహితురాలితోనే ఉంటున్నాడు. ఇదే విషయంలో ఇటు అన్సారీ.. సల్మాబేగంల మధ్య.. అటు సల్మాబేగం స్నేహితురాలు.. ఆమె భర్త మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సల్మాబేగం స్నేహితురాలి వద్దకు ఆమె భర్తతో పాటు కుటుంబీకులు వచ్చారు. పంచాయతీ జరగగా, ఇరు కుటుంబాల మధ్య గొడవలు వద్దని ఎవరి జోలికి ఎవరూ వెళ్ల వద్దని ఒప్పందానికి వచ్చారు. చర్చలు అయిపోయిన తర్వాత రాత్రి పది గంటల సమయంలో స్థానిక రాయరావు చెరువు వద్దకు సల్మాబేగం స్నేహితురాలు.. ఆమె భర్త.. కుటుంబ సభ్యులు వచ్చారు. ఈ క్రమంలో ఆమె అన్సారీకి ఫోన్ చేసి 'మరో వ్యక్తితో సంబంధం పెట్టుకున్నావని.. నన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నారు.. వెంటనే రా' అని చెప్పింది. అన్సారీ అక్కడికి వెళ్లగా, ఆమె భర్తతో పాటు కుటుంబీకులు తన భర్త చేతులు, కాళ్లు పట్టుకుని కత్తితో ఇష్టానుసారంగా పొడిచి పక్కనే ఉన్న పొదల్లో పడేశారని, తనకు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి వెళ్లి చూడగా, తన భర్త రక్తపు మడుగులో పడి ఉన్నాడని అన్సారీ భార్య సల్మాబేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అప్పటికే అతడు చనిపోయాడని వివరించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడితో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ జాన్‌రెడ్డిలు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

రామచంద్రాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని కొల్లూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం ఆరాదియా జిల్లాకు చెందిన దిల్‌కుష్‌కుమార్(23) తెల్లాపూర్‌లోని 'మై హోం సయుక్' నిర్మాణ సంస్థలో కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి వద్ద దిల్‌కుష్‌కుమార్ 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేశాడు. దీన్ని మై హోం సయుక్‌లోని లేబర్‌లకు విక్రయించే క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు అతన్ని పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న 470 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేశ్‌పటేల్ తెలిపారు.

145 గ్రాముల గంజాయి పట్టివేత

తూప్రాన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెయింటర్‌గా పనులు చేస్తూ ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శివ్వంపేట మండలం లచ్చిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన శ్రావణ్(24) పెయింటర్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రేమ వివాహం చేసుకున్న శ్రావణ్ కొంత కాలం తూప్రాన్ పట్టణంలో పోలీసుస్టేషన్ వెనుక నివాసముంటున్నాడు. శ్రావణ్ గుట్టుగా గంజాయి తీసుకువచ్చి అమ్మకాలు నిర్వహిస్తున్నాడు. స్థానికులకు అమ్మకాలు చేస్తే బయట పడతామని, ఇతర రాష్ట్రాల వ్యక్తులను ఎంచుకొని అమ్మకాలు జరుపుతున్నాడు. నమ్మదగిన సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో శ్రావణ్ వద్ద 145 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దారిమళ్లిన సీఎంఆర్ ధాన్యం

● గుర్తించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
● రెండు రైస్ మిల్లులపై కేసు

నారాయణఖేడ్/కల్హేర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ ధాన్యం(కస్టమ్ మిల్లింగ్ రైస్) దారి మళ్లించిన రెండు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తెలిపారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని రెండు రైస్‌మిల్లుల్లో దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని దారి మళ్లించినట్లు గుర్తించామని, ప్రభుత్వ నిధులు సహజ వనరుల దుర్వినియోగానికి సంబంధించి కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు. సీఎంఆర్ ధాన్యం దారి మళ్లించినట్లు సమాచారం అందడంతో సిర్గాపూర్ మండలం కడ్పల్ శివారులోని సాయ్రామాట్ ఫుడ్ ఇండస్ట్రీస్, కల్హేర్ మండలం మార్డి శివారులోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్‌లో సోమవారం ఆర్సీపూర్ యూనిట్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కడ్పల్ శివారులోని సాయ్రామాట్ ఫుడ్ ఇండస్ట్రీస్‌లో రబీ, ఖరీఫ్ 2024-2025 సీజన్‌కు సంబంధించి దాదాపు 40,834.98 క్వింటాళ్ల(1,02,087 బస్తాలు) తక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఈ ధాన్యం విలువ రూ. 9,47,37,153 ఉంటుందని అధికారులు తెలిపారు. మార్డి శివారులోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్‌లో తనిఖీలు చేయడంతో 3,313 క్వింటాళ్ల (82.83 బస్తాలు) ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ ధాన్యం విలువ రూ. 76,86,624 ఉంటుందని తెలిపారు. ఈ మేరకు రెండు రైస్ మిల్లులపై మంగళవారం కేసులు నమోదు చేశారు. ఎక్కడైనా సహజ వనరులు, ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 14432 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా

తూప్రాన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో హల్దీ వాగు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వడంతో ఒకచోట డంప్ చేసి టిప్పర్లలో రవాణా చేస్తున్నారు. తూప్రాన్ పట్టణ పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుకను మంగళవారం ఇసుక వ్యాపారులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుకను సేకరిస్తున్నారు. టిప్పర్లలో తూప్రాన్ ప్రాంతానికి తరలించి, విక్రయాలు చేస్తున్నారు. మంగళవారం ఓ టిప్పర్‌లో ఇసుకను నింపి, పైన గుర్తుపట్టకుండా ఉండేందుకు డస్ట్ నింపి రవాణా చేస్తున్నారు. ఈ విషయం తెలిసి ఇసుక వ్యాపారులు టిప్పర్‌ను అడ్డగించి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కల్యాణం.. కమనీయం..

● వర్గల్ శంభుగిరి క్షేత్రంలో వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


పార్వతి పరమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వర్గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ కేంద్రంలోని శంభుగిరి కొండ గుహల్లో స్వయంభువుగా వెలసిన అన్నపూర్ణ సహిత స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో, కార్తీకమాసం సందర్భంగా మంగళవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు జంగం వీరభద్రయ్య శివస్వామి నేతృత్వంలో శంభులింగేశ్వర స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి ప్రస్థానం, విజయోత్సవ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్యన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను భక్తులు స్వీకరించారు. వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో జ్వాలతోరణం

వర్గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం రాత్రి ఆలయం వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిత్య కార్తీక దీపోత్సవంలో భాగంగా జ్వాల తోరణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి దేవతామూర్తులను మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు జ్వాల తోరణం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం అంధకారం

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

పుల్‌కల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం అంధకారమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. చౌటకూరు మండలం సుల్తానాపూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 'నషా ముక్త్, భారత్-కుష్‌హల్ భారత్' కార్యక్రమంలో మంగళవారం మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ముందుగా జిల్లా అదనపు కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, జిల్లా మహిళా, శిశు, వికలాంగుల సక్షేమ శాఖ అభివృద్ధి అధికారి లలితాకుమారిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్‌ను విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విశ్వనాథ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శైలజ, సునీత, బేబీశాలిని, జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్, సుల్తాన్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, చంటి రమేశ్ పాల్గొన్నారు.

లంచాల లాఠీ..!

(5వ పేజీ తరువాయి)

పట్టుబడడంతో స్థానికులు టపాసులు కాల్చారంటేనే అతని తీరు ఎలాంటిదో అర్థమవుతోంది.

సిద్దిపేటలో సెట్‌రైట్

సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.ఎం విజయ్‌కుమార్ పదేపదే పోలీస్ శాఖను హెచ్చరిస్తున్నారు. ఎవరైనా లంచం అడిగినా, సివిల్ పంచాయతీల్లో తలదూర్చినా తగిన చర్యలు తప్పవని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. పోలీసుల కనుసన్నల్లో ఇప్పటిదాకా కొనసాగిన పలు అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురిని మందలించినట్లు తెలిసింది. మరోసారి ఆరోపణలు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సూచనలు చేసినట్లుగా సమాచారం. ప్రధానంగా దళారులు స్టేషన్లలోకి ఎంట్రీ ఇవ్వొద్దని హెచ్చరించారు. సీపీ వైఖరితో ఎప్పుడేం జరుగుతుందోనని పోలీస్‌శాఖలో భయం పట్టుకుంది.

ఐఐటీ హైదరాబాద్‌లో జపాన్ అకాడమిక్ డే

కంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో మంగళవారం జపాన్ అకాడమిక్ డే 3వ ఎడిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జపాన్-ఇండియా విశ్వవిద్యాలయాల ఫోరమ్ నుంచి 37 జపనీస్ విశ్వవిద్యాలయాలు, 36 భారతీయ విశ్వవిద్యాలయాల అధిపతులు హాజరయ్యారు. భారతదేశంలో జపాన్ గౌరవనీయ రాయబారి ఓనో కీచి, జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జేఎస్‌టీ) అధ్యక్షుడు డాక్టర్ హషిమోటో కజుహిటో, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి ఈ సందర్భంగా మాట్లాడారు.



మంజీర నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొల్చారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొల్చారం మంజీర నదిలో గల్లంతైన యువకుని మృతదేహం మంగళవారం పోతంశెట్టిపల్లి శివారు మొదటి బ్రిడ్జి వద్ద లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన తాపీ మేస్త్రీ కోటేశ్వరరావు (34) తన స్నేహితులతో ఆదివారం ఏడుపాయల వన దుర్గ మాతను దర్శించుకోవడానికి వచ్చారు. నదిలో స్నానానికి వెళ్లగా, నది ప్రవాహానికి కొట్టుకుపోయాడు. వెంటనే స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జాలర్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఆదివారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. మంగళవారం బండరాళ్ల మధ్య మృతదేహం లభ్యమైంది. భార్య రోహిణి ఫిర్యాదు మేరకు ఎస్సై మొయినుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మిరుదొడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సమత కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎనగంటి రాజు (45) తనకున్న మూడు ఎకరాల్లో నాలుగు బోర్లు వేశాడు. ఇందుకోసం అప్పులు చేశారు. అలాగే, కుమార్తె వివాహానికి సుమారు రూ. 18లక్షల వరకు అప్పులు అయ్యాయి. వ్యవసాయంపైనే ఆధారపడిన రాజు అప్పులు తీరే మార్గం కనిపించక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో వ్యవసాయ భూమి వద్ద క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో చనిపోయాడు.

రైలు కిందపడి యువకుడు..


సాయికుమార్ (ఫైల్)

తూప్రాన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రైల్వే ట్రాక్‌పై మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణంలో నివాసముండే మణి, గోపీచారి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. నాలుగైదు ఏళ్ల క్రితం గోపీచారి మృతి చెందగా, మణి ఇద్దరు కుమారులతో జీవిస్తోంది. చిన్న కుమారుడు వడ్ల సాయికుమార్ (27) కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. సాయికుమార్ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. రెండేళ్ల క్రితం సాయికుమార్ పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించగా, చికిత్స అందించడంతో కోలుకున్నాడు. మద్యం సేవించి ఇంట్లో గొడవలు చేస్తున్నాడు. సోమవారం సైతం మద్యం సేవించి ఇంటికి రాగా కుటుంబ సభ్యులు మందలించారు. దాంతో ఇంట్లోంచి బయటకు వెళ్లిన సాయికుమార్ బ్రాహ్మణపల్లి రైల్వే లేవల్ క్రాసింగ్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు దొంగను పట్టించిన సీసీ కెమెరా

పటాన్ చెరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో గొలుసు లాక్కొని పారిపోయిన ఓ దొంగను సీసీ కెమెరా ఆధారంగా పట్టుకున్న సంఘటన పటానచెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వినాయక రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు జీఎంఆర్ కూడలిలోని అపోలో మెడికల్ షాపులో జాటోతు నిఖిత అనే మహిళ పని చేస్తుండగా, పటానచెరు చైతన్య నగర్‌లో నివాసం ఉంటున్న కొమరగూడెం లోకేష్ అనే వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు అందుకున్న పోలీసులు షాపులో సీసీ కెమెరా ఆధారంగా గంట సమయంలోనే లోకేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారిపై కేసు

దుబ్బాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, పలువురిని ఇబ్బందులకు గురి చేస్తున్న ఒక వడ్డీ వ్యాపారిని మంగళవారం దుబ్బాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గంబీర్‌పూర్ గ్రామానికి చెందిన చింతు గణేష్ వడ్డీ వ్యాపారి. బంగారం, భూమి, వాహన పత్రాలు కుదువ పెట్టుకుని అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ పలువురిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న దీనిపై దుబ్బాక పోలీసులు అతని ఇంటిపై దాడి చేసి, అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి నాలుగు కార్లు, ఒక ట్రాక్టర్, ఏడు ద్విచక్ర వాహనాలు, ప్రామిసరీ నోట్లు, భూముల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు సుమోటోగా వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్తం

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 19 న విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించే ఫోరం సదస్సు నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఎస్ఈ కామేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల వరకు ఆధార్, కరెంట్ బిల్లు జిరాక్స్‌తో వినియోగదారులు హాజరుకావాలని సూచించారు.

సంగారెడ్డి జీఎంసీలో ఘనంగా వైట్ కోట్ వేడుక

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫస్టియర్ ఎంబీబీఎస్ వైద్య విద్యార్థుల వైట్ కోట్(తెల్ల కోట్)వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రిన్సిపాల్ డా॥ప్రకాశ్‌రావు మాట్లాడుతూ వైద్య వృత్తిలో రాణించాలంటే అంకితభావంతో పాటు సామాజిక బాధ్యత అవసరమన్నారు. అనంతరం తెల్ల కోట్ బాధ్యతలను ఆయన వివరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, మెడికోలు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు గట్టున హెచ్చరిక బోర్డు

చేగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం వడియారం చెరువులో ఇటీవల మొసళ్లు కనిపించడంతో చెరువు పరిసర ప్రాంతంలోకి వెళ్లవద్దని గ్రామపంచాయతీ కార్యదర్శి విజయపాల్ రెడ్డి సూచించారు. ఈ మేరకు చెరువుగట్టున హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. చేగుంట సెక్షన్ ఆఫీసర్ కిరణ్ కుమార్, బీట్ ఆఫీసర్ రవి, చెరువును సందర్శించి పరిశీలించారు. చుట్టుపక్కల రైతులు ఇతరులు చెరువులో వెళ్లకుండా ఉండాలని సూచించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చెరువుగట్ల పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వితంతువులకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం: ఆర్డీవో

తూప్రాన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వితంతువులకు తెలంగాణ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) కింద రూ. 20వేలు మంజూరవుతాయని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు.మంగళవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఈ పథకంపై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల విహారయాత్రకు సహాయం

రామచంద్రాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ ఇటీవల ప్రవేశపెట్టిన యాత్రదానం కార్యక్రమానికి మంచి స్పందన వస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల గ్రామంలో జిల్లాపరిషత్ విద్యార్థుల విహార యాత్రకు దాతలు ఆశం గారి వీరమ్మ, రాజులు ముందుకు వచ్చారు. ఈ మేరకు వారు ప్రధానోపాధ్యాయుడు సుభాష్, ఉపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, ఆర్టీసీ హెచ్‌సీయూ డిపో అధికారుల సమక్షంలో వారు చెక్కులను అందించారు. ఒక్కో చెక్కు విలువ రూ.14,250 కలిగి ఉందన్నారు.

రేజ్లింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థులకు బంగారు పథకాలు

కంగ్టి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడల్లో మండల కేంద్రమైన కంగ్టిలోని ఎస్టీ బాలుర గురుకులానికి చెందిన ఇద్దరు విద్యార్థులు, బంగారు, మరో ఇద్దరు విద్యార్థులు వెండి పథకాలు కైవసం చేసుకున్నారు. 55 కిలోల అండర్ 17 విభాగంలో ఆర్.సంగ్రాం బంగారు పథకాలు కైవసం చేసుకోగా 45 కిలోల అండర్ 14 విభాగంలో ఆర్.గణేష్ లు వెండి పథకాలు దక్కించుకున్నారు. వీరిలో పి.శివాజీ, ఆర్ సంగ్రాంలు రంగారెడ్డి జిల్లాలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలలో మాసాయిపేట విద్యార్థికి మూడవ స్థానం

మాసాయిపేట, ,నవంబరు 18(ఆంధ్రజ్యోతి) ఈనెల 16 నుండి 18 వ తేదీ వరకు నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో మాసాయిపేట విద్యార్థికి మూడో స్థానం లభించినట్లు మాసాయిపేట పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్యాంసుందర్ శర్మ తెలిపారు మెదక్ జిల్లా జట్టు నుంచి మాసాయిపేట పాఠశాలకు చెందిన హేమంత్ క్రీడా పోటీలలో పాల్గొని విజేతగా ఉత్తమ ప్రతిభ కనబరిచి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో ఫుట్బాల్ విభాగంలో విజేతగా నిలిచారు.

జిన్నారం మున్సిపాలిటీలో సమస్యల తిష్ట

- కొత్త మున్సిపాలిటీని వేధిస్తున్న నిధుల లేమి
- వార్షికాదాయం రూ.34 లక్షలు
- అభివృద్ధి మాట అటుంచితే.. కనీస ఖర్చులకైనా సరిపోని ఆదాయం
- 6 నెలలుగా పారిశుధ్య సిబ్బందికి అందని వేతనాలు
- కార్మికుల ఆందోళనతో పడకేసిన పారిశుధ్యం



జిన్నారం మున్సిపల్ కార్యాలయం

జిన్నారం, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి): జిన్నారం కేంద్రంగా ప్రభుత్వం నూతన మున్సిపాలిటీ ఏర్పాటు చేయగా కనీస మౌళిక వసతుల కల్పనకు నిధుల లేని దుస్థితి. ఇదీ చాలదన్నట్టు ఆరు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వటం లేదని సిబ్బంది ధర్నాకు దిగటంతో సమస్య రెట్టింపైంది. ఇక కొత్త మున్సిపాలిటీకి ప్రభుత్వం అందించే రూ.15 కోట్ల ప్రత్యేక నిధుల కోసం నిరీక్షణ తప్ప చేసేదేమీ లేదన్నట్టు మారింది పరిస్థితి. గ్రామాల్లో సమస్యల తిష్ట, సిబ్బందికి వేతనాలు లేక అధికారులు ప్రత్యేక నిధుల రాకకోసమే వేచి చూస్తున్నారు.

పాలకవర్గాలు లేక..

పది గ్రామ పంచాయతీల విలీనంతో నూతనంగా ఏర్పాటైన జిన్నారం మున్సిపాలిటీకి నిధుల సమస్య జటిలంగా మారింది. రెండేళ్లుగా పంచాయతీ పాలకవర్గాలు లేక ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోగా.. సమస్యలు పేరుకుపోయాయి. గ్రామాల్లో అంతర్గత రహదారులు, నీటి సరఫరా, డ్రైనేజీలు తదితర సమస్యలు వెంటాడుతుండగా, కనీసం వీధి దీపాలను కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి నెలకొన్నది. మున్సిపల్ అకౌంట్‌లో నిధులు లేక పోవటంతో గ్రామాల్లో అభివృద్ధి మాటేమో గాని కనీసం చిన్న చిన్న సమస్యలు పరిష్కారం కోసం అధికారులు ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొన్నది.

ఖర్చులకైనా సరిపోని ఆదాయం

జిన్నారం మున్సిపాలిటీ వార్షిక ఆదాయం రూ.34 లక్షలే కావడంతో ప్రభుత్వం మంజూరు చేసే రూ.15 కోట్ల ప్రత్యేక నిధుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. జిన్నారం సహ విలీన గ్రామాల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం కనీస ఖర్చులకు కూడా సరిపోదు. ముఖ్యంగా మున్సిపాలిటీలో 72 మంది పారిశుధ్య సిబ్బంది ఉండగా వారికి గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. గ్రామ పంచాయతీల్లో ఒక్కో కార్మికుడికి రూ.9,500 వేతనం ఉండగా.. మున్సిపాలిటీగా మారడంతో వారికి నెలకు రూ.15,500 వేతనం ఇవ్వాల్సి ఉన్నది. ఈ లెక్కన రూ.18 లక్షల వేతనాలు కార్మికులకు ఇవ్వాల్సి ఉన్నది. తమకు వెంటనే వేతనాలు చెల్లించాలంటూ తరచూ కార్మికులు ధర్నా. ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు మరి కొందరు మున్సిపల్ సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించాల్సి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించగా.. జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీలకు మంజూరు చేయాల్సి ఉన్నది. ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేస్తేనే కొత్త మున్సిపాలిటీ సిబ్బందికి వేతనాలు సహ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి మోక్షం లభించే పరిస్థితి నెలకొన్నది.

వేతనాల కోసం కార్మికుల ధర్నా

ఆరు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదంటూ జిన్నారం మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ధర్నాకు దిగారు. మంగళవారం జిన్నారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వేతనాల కోసం పారిశుధ్య సిబ్బంది ధర్నా నిర్వహించారు. 6 నెలలు గడుస్తున్నా, తమకు వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. ఒక్కో కార్మికుడికి రూ.75వేల వరకు వేతనాలు బకాయి ఉన్నా, ప్రభుత్వం కానీ, అధికారులు కానీ స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాలు లేకుండానే గ్రామాల్లో సేవలు అందిస్తున్న తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వెంటనే తమకు రావలసిన వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు వివిధ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట సిబ్బంది ధర్నా

ఆలయాల్లో కార్తీక పూజలు





ఖేడ్ కల్హనా హనుమాన్ ఆలయంలో, బడంపేట రాచన్నస్వామి ఆలయం పరిసరాల్లోని ఉసిరి చెట్ల వనంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నారాయణఖేడ్/కోహీర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్ లోని ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం సాయంత్రం మహిళలు ఆయా ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని కల్హనా హనుమాన్ ఆలయం ఆవరణలో శివ పార్వతుల కల్యాణం, కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కోహీర్ మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీ రాచన్న స్వామి ఆలయం వద్ద కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహా రుద్రాభిషేకం అమ్మవారి కుంకుమార్చన జరిపారు. ఆలయం సమీపంలోని ఉసిరి వనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఉసిరి చెట్ల వద్ద దీపోత్సవం నిర్వహించారు.

వైద్య విద్యార్థులకు సకల సౌకర్యాలు: రాహుల్‌రాజ్



అధికారులతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్

మెదక్ , కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) వైద్య విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు, మంగళవారం మెదక్ పట్టణ పరిధిలోని పిల్లికోట్లాల్‌లో గల మెడికల్ కళాశాల, క్రిటికల్ కేర్ సెంటర్, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా మెడికల్ కళాశాలలో తరగతి గదులు, ల్యాబ్‌లు, డెమో రూమ్‌లు, లైబ్రరీలను పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మెడికల్ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్ చట్టాలు కఠినంగా ఉంటాయని సూచించారు. అనంతరం మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ నెలలోనే రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభం కావడం వల్ల వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం నిర్మాణం చివరి దశలో ఉన్న క్రిటికల్ కేర్ సెంటర్‌ను పరిశీలించారు. త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మాతా శిశు కేంద్రంలో రోగులతో మాట్లాడి సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నితిన్ కాబ్రా, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత, డీసీహెచ్ఎస్ శివదయాల్, వివిధ శాఖల ప్రొఫెసర్లు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు



రేగోడులో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

రేగోడు నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తీసుకుంటామని రేగోడు ఎస్ఐ పోచయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని వెంటనే తొలగించాలని రైతులకు సూచించారు. రోడ్లపై ధాన్యం అరబోస్తే ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణ నష్టం జరుగుతుందని తెలిపారు. రైతులు రోడ్లపై కాకుండా ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచించారు.

● **పాపన్నపేట:** రోడ్లపై ఆరబోసిన ధాన్యం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురైతే సంబంధిత రైతులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మిన్‌పూర్, యూసుఫ్‌పేట, కొత్తపల్లి గ్రామాల శివార్లలో రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. ఈ మేరకు రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులకు నోటీసులు అందజేశారు. ధాన్యం కుప్పల వద్ద ప్రమాదాలు జరిగితే చర్యలు తప్పవన్నారు.



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సర్కార్ బడుల్లో సౌకర్యాలు కల్పించండి

రామచంద్రాపురం టౌన్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్రమంత్రి సావిత్రిఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛవిద్యాలయ పథకం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్మించేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. అమ్మాయిలు బహిరంగ ప్రదేశాలకు వెళుతున్నప్పుడు పాముకాట్లకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారని వివరించారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న పృథ్వీరాజ్

పటాన్‌చెరు నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మాజీ సర్పంచ్ దేవేందర్ రాజు జన్మదిన వేడుకలను ఎండీఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఇంద్రేశం అనాథాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ మహిళలకు అన్నదానం చేశారు. ఎండీఆర్ పౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఏదైనా సందర్భాన్ని పురస్కరించుకుని అనాథలకు సేవచేయడానికి ప్రయత్నం చేయాలని కోరారు. వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

తాగునీటి కోసం గ్రామస్తుల ధర్నా



ఉత్తర్‌పల్లి పంచాయతీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని ఉత్తర్‌పల్లి గ్రామంలో తాగునీటి కోసం గ్రామపంచాయతీ ఎదుట మంగళవారం గ్రామస్థుల ధర్నా చేశారు. 20 రోజులుగా తాగు నీటి సమస్య ఉన్నా పంచాయతీ అధికారులు, ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మంచినీటి సమస్య పరిష్కరించకపోతే జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు. ధర్నాలో గ్రామస్థులు పాల్గొన్నారు.

బస్తీదర్శన్‌తో సమస్యల గుర్తింపు

రామచంద్రాపురం టౌన్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నిత్యం పర్యటించడం ద్వారా సమస్యలు గుర్తించే అవకాశాలు ఉన్నాయని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్‌ఐజీ కాలనీలో బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. వరదకాలువల నిర్మాణాలు చేపడతామని వివరించారు. బోంబేకాలనీలో మురుగు పైపులైన్‌లు వేసిన తరువాత సీసీరోడ్లు నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు.



పటాచెరు: ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న నటుడు, బిగ్ బాస్ ఫేమ్ శేఖర్ బాషా



జిన్నారం గురుకుల పాఠశాలలో పంజాబీ వేషధారణతో విద్యార్థుల ప్రతిజ్ఞ

మాదక ద్రవ్యాలపై అవగాహన

నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన సదస్సులు నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి)



మెదక్‌లో పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ మహేందర్



నర్సాపూర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్, ఎక్సైజ్ అధికారులు, విద్యార్థులు

తప్పుడు ఆరోపణలు సరికాదు

నర్సాపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘం నాయకులు కొందరు పూర్తి సమాచారం తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలు చేయడం తగదని ఎంఈవో తారాసింగ్ పేర్కొన్నారు. నర్సాపూర్ సమీపంలోని శ్రీవత్సవ్ గురుకుల పాఠశాలకు అనుమతులు లేకుండా నడుపుతున్నారని దానికి ఎంఈవో వత్తాసు పలుకుతున్నాడంటూ ఓ విద్యార్థి సంఘం నాయకులు చేసిన ఆరోపణలు సందర్భంగా ఆ పాఠశాలను మంగళవారం ఎంఈవో తారాసింగ్, ఎంపీసీ కోఆర్డినేటర్ సుధాకర్‌గౌడ్‌లు సందర్శించి రికార్డులన్నింటిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీవత్సవ్ గురుకులానికి అన్ని అనుమతులు ఉన్నాయన్నారు. కేవలం దురుద్దేశంతోనే విద్యార్థి సంఘం నాయకులు పాఠశాలతో పాటు తనపై అడ్డగోలుగా ఆరోపణలు చేశారన్నారు. పాఠశాల డైరెక్టర్ సురేష్, ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ తమ పాఠశాలకు అన్ని అనుమతులు ఉన్నాయన్నారు.

పిల్లల రక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పిల్లల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని రిషి హైస్కూల్‌లో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల రక్షణలో ప్రతీ విద్యార్థి, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు, సమాజం మొత్తం బాధ్యత వహించాలన్నారు. ఏ ఘటన జరిగినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 181 మహిళా హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాధిత పిల్లలు, మహిళల కోసం భరోసా కేంద్రాల ద్వారా ఉచిత న్యాయ, వైద్య, కౌన్సెలింగ్, పిల్లల భద్రత గురించి వివరించారు.

రోడ్డు భద్రతపై పర్యవేక్షణ చేపట్టాలి

తూప్రాన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు పర్యవేక్షణ చేపట్టాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ సూచించారు. మంగళవారం తూప్రాన్ పోలీసు సబ్ డివిజన్ పరిధి నేర సమీక్ష నిర్వహించారు. నేరాలు, ప్రమాదాల నివారణకు పర్యవేక్షణ పెంచడంతోపాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, రోడ్డు భద్రతకు తీసుకోవలసిన చర్యలను సూచించారు. పెండింగ్ కేసుల విచారణ, అమలు కానీ ఎన్‌బీడబ్ల్యూలపై చర్చించారు. పోలీసుస్టేషన్‌లలో రికార్డులు సరిగా నిర్వహించడం, కేసుల విచారణ వేగవంతం చేయడం, ప్రజల భద్రతను మెరుగుపరచడం కోసం అధికారులు మరింత క్రమబద్ధీకరణ చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెటుకొని శాంతి భద్రతలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

నేర నియంత్రణకు కార్డన్ సెర్చ్

కొల్చారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు కార్డెన్ సెర్చ్ దోహదం చేస్తుందని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో మెదక్ సబ్‌డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది రంగంపేటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఇంటింటికీ తిరిగి వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

కాంగ్రెస్‌పార్టీలో పలువురి చేరిక

మనోహరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన చూసి ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి. పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులను గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తన నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకుల్లో హరిబాబు, నాగరాజు, జగన్, మార్కుంటి రాజు, అర్కల రాజు, బాలయ్య, నర్సయ్య, కుమార్, మహేష్, ఇతర నాయకులు మోహన్‌రెడ్డి, బాను యాదవ్, రవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మనోహరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఐలయ్య ఉన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకే పోటీలు

● సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

సంగారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సంగారెడ్డిలోని జిల్లా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఏ రంగంలో ఆసక్తి, ఉత్సాహం ఉంటుందో ఆయా రంగాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాసం, పోస్టర్ తయారీలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వంశీకృష్ణ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు: సునీతారెడ్డి

కొల్చారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొల్చారం రైతులు పండించిన ధాన్యం విషయంలో మిల్లర్లు ఇబ్బందులు పెట్టవద్దని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు మంగళవారం రంగంపేట సహకార సంఘం 72వ వార్షికోత్సవ సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా వరి సాగు కొల్చారం మండలంలో జరుగుతుందని, అందుకు సహకార సంఘం ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని తెలిపారు. అనంతరం ఎనుగండ్ల గ్రామంలో రూ.10 లక్షలతో రైతులకు సంబంధించిన ప్రహరీని ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ రమేష్ జిల్లా వ్యవసాయ అధికారి దేవి కుమార్ హార్టికల్చర్ ఏడీ ప్రతాప్ సింగ్, సీఈవో నవీన్, ఏవో శ్వేత, నాయకులు , డైరెక్టర్లు పాల్గొన్నారు

రాయసముద్రం చెరువు సుందరీకరణకు నిధులు

రామచంద్రాపురం టౌన్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం డివిజన్ పరిధి రాయసముద్రం చెరువు సుందరీకరణ పనులు చేపట్టడానికి హెచ్‌ఎండీఏ నిధులు మంజూరు చేసిందని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పాతరామచంద్రాపురంలో పర్యటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెరువు కట్టపై ఉన్న నాగుళమ్మ ఆలయం వద్ద మట్టి కుంగుతోందని చెప్పారు. చుట్టూ ప్రహరీ నిర్మించడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కాలనీవాసులకు పూర్తిస్థాయి ఆహ్లాదాన్ని పంచడానికి చెరువును సుందరంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు.

బస్తీల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి

పటాన్‌చెరు నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి గోకుల్‌నగర్‌లో పర్యటించారు. సీసీరోడ్డు వేయడానికి కావాల్సిన ఏర్పాట్లు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న యాదవసంఘం భవనాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తామని చెప్పారు.

ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు నిలయం యోగాభవన్

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు నిలయం యోగాభవన్ అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని యోగాభవన్‌లో మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ యోగా భవన్‌కు అవసరమైన పూర్తి సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం ఎమ్మెల్యేలను యోగాభవన్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగ అధ్యక్షుడు దినేష్, ప్రధాన కార్యదర్శి సోమలింగం, ఉపాధ్యక్షులు రాజు, సతీష్, పతంజలి యోగా అధ్యక్షురాలు వాసుదేవి, భారతీయ స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడు నవాజ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విఠలేశ్వరుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి



విఠలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి

మునిపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారం గ్రామంలో జీవన్ముక్త పాండురంగ విఠలేశ్వర ఆలయ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. రుక్మిణి సమేత విఠలేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వెంట మాజీ జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్, మాజీ ఎంపీపీ శైలజ శివశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.